ప్రజలతో మమేకం కావాలి

- గృహ సారథులు, కన్వీనర్లు ప్రభుత్వ పథకాలను వివరించాలి
- అర్హులందరికీ న్యాయం చేయాలి
- ఎమ్మెల్యే కాటసాని, జిల్లా పరిశీలకులు రామసుబ్బారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు: ప్రజల వద్దకే పాలన ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, గృహసారథులు, మండల కన్వీనర్లు ప్రజలతో మమేకం కావాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా జగనన్న ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నారని, వీటిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రం అవుకు సీబీఆర్ కాంప్లెక్స్‌లో శుక్రవారం గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా పరిశీలకుడు, మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రా రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి, అవుకు సొసైటీ అధ్యక్షుడు చల్లా విజయభాస్కర్ రెడ్డి, దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డి సతీమణి, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ, దివంగత నేత చల్లా రామకృష్ణారెడ్డి కుమారుడు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మందా గుర్రమ్మ, ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ముక్కమళ్ల పుల్లారెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి హాజరైన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయ, గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన మూడున్నర ఏళ్లలోనే మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను 95శాతం నెరవేర్చడమే కాకుండా ఇవ్వనివి కూడా అమలు చేస్తున్న ఘనత ఒక్క వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమం కోసం అందిస్తున్న 32 సంక్షేమ పథకాల్లో ఏ పథకం బాగోలేదో చెప్పే ధైర్యం టీడీపీ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. కరోనా కష్టకాలంలో దేశమంతా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే జగనన్న ఏమాత్రం అలాంటి లోటును తెలియకుండా సంక్షేమ పాలనను కొనసాగించారని గుర్తుచేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనను, చేసిన అభివృద్ధిని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. అలాగే వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

సైకోలా వ్యవహరిస్తున్న బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె నియోజకవర్గంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధితో పెరిగిన ప్రజాదరణను ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సైకోలా వ్యవహరిస్తున్నారని, ప్రజలకు మేలు జరగకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని విమర్శించారు. బనగానపల్లెలో 3300 మంది నిరుపేదలకు మంజూరు అయిన ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తే... ఎక్కడ కాటసానికి మంచిపేరు వస్తుందోనని కోర్టుకు వెళ్లి అడ్డుకున్నది వాస్తవం కాదా అని బీసీని నిలదీశారు. మైనింగ్ కార్మికుల జీవనానికి ఇబ్బందులు కలుగకుండా మైనింగ్ యజమానులకు అండగా ఉండాలని రాయల్టీలు అందిస్తుంటే... సహించలేని బీసీ...కలెక్టర్ సమావేశానికి వెళ్లి ఎందుకిస్తారంటూ... నానా రభస చేయడం నిజం కాదా అని కాటసాని ప్రశ్నించారు. సామరస్యంగా సమస్యను పరిష్కరించుకునేందుకు పోలీస్ స్టేషన్ ఆశ్రయించిన వారిని విషంతాగి బెదరించడంటూ బీసీ రెచ్చగొట్టి నీచ రాజకీయాలకు పాల్పడడం హేయమని, ఇప్పటికైనా హుందాగా వ్యవహరించాలని ఎమ్మెల్యే కాటసాని హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ సుబ్రమణ్యం, అన్నవరం ఎంపీటీసీ గోపవరం గోపాల్‌రెడ్డి, నాయకులు చెర్లోపల్లె కంబగిరి స్వామి, వల్లపురెడ్డి రామిరెడ్డి, రామారావు, పురుషోత్తం నాయుడు, చౌడయ్య, గంగాధర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

175 స్థానాల్లో గెలుపే ధ్యేయంగా పని చేయాలి

- జిల్లా పరిశీలకులు రామసుబ్బారెడ్డి


గృహసారథికి సంక్షేమ పథకాల వివరాల పత్రాలు అందజేస్తున్న కాటసాని రామిరెడ్డి, రామసుబ్బారెడ్డి

రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 175 స్థానాల్లో గెలిపే ధ్యేయంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులు పని చేయాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా పరిశీలకుడు, మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తుంటే ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీతో గెలుపొందటానికి మీరే క్రియాశీలకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

మద్దిలేటయ్య హుండీ ఆదాయం రూ.32,74,475

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలు, ముడుపుల హుండీ లెక్కింపు నిర్వహించారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ సీతారామ చంద్రుడుడు, పాలక మండలి సభ్యులు ఆధ్వర్యంలో 55 రోజులకు సంబంధించిన హుండీ లెక్కింపు చేపట్టారు. రూ.32,74,475, 16 గ్రాముల బంగారు, 1 కేజీ 600 గ్రాముల వెండి వచ్చినట్లు ఈఓ, చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు లక్ష్మి నాయుడు, సుశీల, రామ సుబ్బమ్మ, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి జాగృతి ఉద్యమం

బనగానపల్లె : జమా అతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న జాగృతి ఉద్యమానికి సంబంధించి 'మానవత-నైతికత' పోస్టర్లను స్థానిక కార్యాలయంలో శుక్రవారం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక జమాఅతె ఇస్లామి హింద్ అధ్యక్షుడు ఎస్ షబ్బీర్‌బాషా మాట్లాడుతూ సమాజంలో మానవతా విలువలు రోజురోజుకు దిగజారుతున్నాయన్నారు. మానవతా విలువలు, దైవభీతి, జవాబుదారితనం తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 11 నుంచి ఈ నెల 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు.

నేటి నుంచి వేంకటరెడ్డి తిరునాల

ప్యాపిలి: పట్టణంలోని స్థానిక వెంకటరెడ్డి కాలనీలో వెలసిన అవధూత వేంకటరెడ్డి తిరునాల వేడుకలు శని, ఆదివారాలు రెండు రోజులు జరుగనున్నాయి. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం, తేరులాగే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తిరునాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున దుకాణాలు వెలిశాయి.

క్లుప్తంగా

గంగమ్మ గుడి నిర్మాణానికి రూ.5లక్షలు విరాళం


చెక్కు అందజేస్తున్న గంగాధర్

డోన్: పట్టణ శివారులోని సున్నంబట్టీల వద్ద నిర్మిస్తున్న గంగమ్మ గుడి నిర్మాణానికి కడప జిల్లా పులివెందులకు చెందిన గువ్వల గంగాధర్ శుక్రవారం రూ.5లక్షలు విరాళంగా అందజేశారు. మున్సిపల్ చైర్మన్‌సప్తశైల రాజేష్, గంగపుత్రుల సంఘం అధ్యక్షుడు గంప వెంకటేశ్వర్లుకు రూ.5లక్షల చెక్కును ఆయన అందజేశారు.కార్యక్రమంలోసంఘం సభ్యులు పానిపూరి మురళీ, అంజి, తిరుపాల్, మనోజ్, గోసానిపల్లె మాధవస్వామి తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిష్ట్రార్ కార్యాలయం తనిఖీ

బేతంచెర్ల: పట్టణంలోని సబ్ రిజిష్ట్రార్ కార్యాలయాన్ని నంద్యాల జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ రామలింగేశ్వరరావు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి స్కానింగ్‌ను పరిశీలించడమే కాకుండా, రిజిస్ట్రేషన్‌పై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో బేతంచెర్ల సబ్‌రిజిస్టర్ అబ్దుల్‌కరీం సిబ్బంది పాల్గొన్నారు.

13న వాహనాల వేలం

బనగానపల్లెరూరల్: బనగానపల్లె సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన 50 ద్విచక్రవాహనాలు, నాలుగు ఆటోలు, రెండు కార్లను ఈ నెల 13న బనగానపల్లె పోలీసు స్టేషన్‌లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ సుబ్బరాయుడు శుక్రవారం తెలిపారు. వేలంలో వాహనాలను దక్కించుకున్న వ్యక్తులు జీఎస్టీతో కలిపి మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని సీఐ తెలిపారు.

నేడు గృహసారథులకు శిక్షణ

బనగానపల్లె: స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని క్రీడామైదానంలో శనివారం గృహసారథులకు శిక్షణా సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకులు అఫ్జల్‌ఖాన్,జిల్లా పరిశీలకులు మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి, ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, పాల్గొనాలని సూచించారు.

నేడు కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాల వెనక సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం శనివారం ఉదయం 9:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి శుక్రవారం తెలిపారు. మండల, పట్టణంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలని వారు సూచించారు.

బ్యాంకు రుణాల సక్రమంగా చెల్లించాలి

బనగానపల్లెరూరల్: డ్వాక్రా సంఘాలు తీసుకున్న బ్యాంకు రుణాలు సక్రమం చెల్లించేలా బుక్ కీపర్లు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం తిరుపాల్ రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో బక్‌కీపర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పొదుపు సంఘాల అభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తుందని, వాటిపై అవగాహన కల్పించాలన్నారు.

ఫారెస్టు హద్దులను పరిశీలించిన ఎఫ్ఆర్ఓ

బనగానపల్లెరూరల్: బనగానపల్లె డివిజన్ ఫారెస్టు పరిధిలో ఉన్న గులాం అలియాబాద్ ఫారెస్టు బీట్ సరిహద్దులను డివిజన్ ఇన్‌చార్జీ ఫారెస్టు రెంజ్ ఆఫీసర్(ఎఫ్ఆర్ఓ) ప్రవీణ్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అటవీశాఖ పరిధిలో ఉన్న భూమి సరిహద్దులను జనరల్ తనిఖీలో భాగంగా రెవెన్యూ, మైనింగ్ అధికారులతో కలిసి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ హైమవతి మండల సర్వేయర్ గీతా గాయత్రి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్యాపిలికి చేరిన దివ్యాంగుడి సైకిల్ యాత్ర

ప్యాపిలి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా కంచలి మండలం బోరంగం గ్రామానికి చెందిన ప్రసాద్ అనే దివ్యాంగుడు చేపట్టిన ట్రై సైకిల్ యాత్ర శుక్రవారం ప్యాపిలికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, డిప్యూటీ తహసీల్దార్ మారుతికి ప్రసాద్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఇవ్వడంతో పాటు విశాఖపట్టణానికి రైల్వే జోన్ ఇవ్వాలని కోరుతూ తాను ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. 2018లో ఇచ్ఛాపురం నుంచి ప్రారంభమైన ఈ యాత్రను 2019 ఎన్నికలు, కోవిడ్ నేపథ్యంలో నంద్యాలలో తాత్కాలికంగా బ్రేక్ వేయాల్సివచ్చిందన్నారు. 19-12-2022 న తిరిగి నంద్యాల నుంచి యాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. మొత్తం 13 జిల్లాల మీదుగా యాత్ర సాగించి అనంతరం ఢిల్లీకి చేరుకుని ఢిల్లీలో ఆరు రోజు ల పాటు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాయుడు

బనగానపల్లెరూరల్: యాగంటి క్షేత్రంలో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే శివరాత్రి బ్రహ్మోత్సాలను అన్నిశాఖల అధికారులు సమన్వయంగా పని చేసి విజయవంతం చేయాలని సీఐ సుబ్బరాయుడు కోరారు. శుక్రవారం శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని శ్రీ ఉమామహేశ్వరకల్యాణ మండపంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణ ఏర్పాట్లు పై వివిధ శాఖల అధికారులతో ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. సీఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ యాగంటి క్షేత్రానికి ఈ సంవత్సరం గత ఏడాది కంటే ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. క్యూలైన్, మంచినీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్యశిబిరాలను ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆలయ చైర్మన్ తొటబుచ్చిరెడ్డి, ఎస్ఐ రామిరెడ్డి, డాక్టర్ శివశంకరుడు, ఏఈ గర్జప్ప, ఆర్టీసీ డీఎం రవికిశోర్ పాల్గొన్నారు.

అగ్రికల్చర్ విద్యుత్‌లైన్ ఏర్పాటుకు రూ.53లక్షలు

డోన్ : మండలం వలసల గ్రామ రైతుల చిరకాల వాంఛ నెర వేరింది. దశాబ్దాలు గడుస్తున్నా ఆ గ్రామ రైతాంగానికి అగ్రికల్చర్ కనెక్షన్లు లేకపోవడం గురించి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకురావడం జరిగిందని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, వలసల వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమంతురెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. మంత్రి బుగ్గన ప్రత్యేక చొరవతో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వలసల గ్రామ రైతులకు అగ్రికల్చర్ కనెక్షన్లు అందజేసేందుకు రూ.53లక్షలు ఖర్చు చేయడం జరిగిందన్నారు. చిన్నమల్కాపురంలోని కొంత ప్రాంతంతో పాటు వలసల గ్రామానికి రైల్వేట్రాక్ అడ్డుగా ఉన్నందువల్ల ప్రత్యేక విద్యుత్ లైన్ వేయలేకపోయారన్నారు. రైల్వే ఉన్నతాధికారులతో పలుమార్లు ప్రభుత్వం చర్చలు జరిపిన మీదట రైల్వే ట్రాక్ కింద కేబుల్ ద్వారా అగ్రికల్చర్ విద్యుత్ లైన్‌ను రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందుకోసం రెండేళ్లు పట్టుదలతో కృషిచేసిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని రాజశేఖర్‌రెడి అన్నారు. ఈ విద్యుత్ లైన్ ఇవ్వడం మూలంగా గ్రామంలో 150 మంది రైతులకు లబ్ధి కలుగుతోందన్నారు.

రామచంద్రారెడ్డిని గెలిపించాలి

బనగానపల్లె: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ బలపరచిన ఎంవీ రామచంద్రారెడ్డిని మంచి మెజార్టీలో గెలిపించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కోరారు. స్థానిక స్వగృహంలో శుక్రవారం ఎమ్మెల్యే కాటసానిని ఎంవీ రామచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఉపాధ్యాయులందరూ ఎంవీ రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు కూడాల శంకర్‌రెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షులు రామపక్కిరరెడ్డి, జీఎస్ శ్రీను, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోండి



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న సప్తశైల రాజేష్

డోన్: ప్రభుత్వ ఉద్యోగాల కోసం యువత ఎదురు చూడకుండా స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ సూచించారు. స్థానిక ప్రభుత్వ శిక్షణా సంస్థ కార్యాలయంలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. మొత్తం 115 మంది నిరుద్యోగులు హాజరవ్వగా, 45 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఐసీఐసీఐ బ్యాంకు, కియా, శ్రీసిటీ, శ్రీ సాయి ఎలక్ట్రికల్, అపోలో ఫార్మసీ, హోండా, మోబిస్ లాంటి కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాలో యువతకు ఉద్యోగాలు కల్పించారు. నెలలో ఒకసారి ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించే జాబ్‌మేళాలో నిరుద్యోగులు పాల్గొని ఉపాధి పొందాలని ఈ సందర్భంగా చైర్మన్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మల్లికార్జున రెడ్డి, ఆర్ట్ రమణ, ధారా హరినాథ్‌రెడ్డి, పాలుట్ల రఘురాం, ప్రిన్సిపాల్ రాయపురెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలి


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న లక్ష్మిదేవి

కోవెలకుంట్ల: పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు లక్ష్మిదేవి సూచించారు. శుక్రవారం సంజామల మండలం అక్కంపల్లె, నొస్సం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు.చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం తదితర వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి,బిడ్డ సంరక్షణకు ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. శారీరక, మానసిక ఎదుగుదల లోపించిన చిన్నారులను గుర్తించి వారికి అదనంగా పౌష్టికాహారం అందజేయాలని సూచించారు.బాల్య వివాహాలను అరికట్టేందుకు ఐసీడీఎస్, పోలీసులు కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో సీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్ శాంత,అంగన్‌వాడీకార్యకర్తలు పాల్గొన్నారు.

శనగల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు


రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ కృష్ణమోహన్‌రెడ్డి

కొలిమిగుండ్ల: రైతుల విన్నపం ఉన్నతాధికారులతో మాట్లాడి శనగల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఏడీఏ కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కొలిమిగుండ్లలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ బుకింగ్, ఈ-కేవైసీ వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు అందించాలన్నారు. వైఎస్సార్ యాప్‌లో వీఏఏలు హాజరు నమోదు చేయాలన్నారు. వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు మంజూరు చేయాలని పలువురు రైతులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పవన్‌కుమార్, పశువైద్యాధికారి పద్మావతి ఏఈఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: గ్రామాల అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని, అర్హులందరికీ బాధ్యతగా సంక్షేమ పథకాలు అందజేయాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ వెంగన్న ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. విద్యుత్, వ్యవసాయం, విద్య, వైద్య, ఆరోగ్య, తాగునీరు, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, ఉపాధి, పొదుపు, హౌసింగ్, ఐసీడీయస్ శాఖల అధికారులు తమతమ ప్రగతి నివేదికలను సభకు వివరించారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ఇంటింటికీ తాగునీరు అందించేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. గృహాని బిల్లులు మంజూరు విషయంలో హౌసింగ్ ఏఈ నిర్లక్ష్యం చేస్తున్నారని సీతారామాపురం, గోరుమానుకొండ సర్పంచ్‌లు వేణుగోపాలు రెడ్డి, వెంకటేశ్వర్లు ఆందోళన చేయగా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ తెలిపారు. సీసీ రోడ్లు, సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్ల భవన నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని, పాలుట్ల రంగ స్వామి ఆలయ రహదారి కి ప్రతి పాదనలు పంపుతున్నట్లు పంచాయతీ రాజ్ ఇంజనీర్ గణేష్ తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయానికి రూ. 3 కోట్లతో రహదారి పనులు చేపట్టడమే కాకుండా, చిన్న తిరుమల తరహాలో వైష్ణవ పుణ్య క్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయాన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. అందరం బాధ్యతగా పనిచేసి అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ఎక్కడైనా గ్రామాల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. బోరు బావులు మరమ్మతులకు గురైనా, పైపు లైనులు లీకేజీలు ఉన్న యుద్ధ ప్రాతిపాదికన పనులు చేపట్టాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శివలక్ష్మమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, ఏపీఓ శేషన్న, ఆయా గ్రామాల సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, శ్రీరాములు, యుగంధర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గుమ్మగాలరాజు, ఎంపీటీసీలు రామచంద్రారెడ్డి , మరియమ్మ, ఇందిర, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మందు బాబులకు జైలు శిక్ష

కోవెలకుంట్ల: స్థానిక పోలీస్ సర్కిల్‌లోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంకన్ డ్రైవ్ కేసుల్లోని మందుబాబులకు శుక్రవారం మేజిస్ట్రేట్ అబ్దుల్ రెహమాన్ జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. సంజామల పోలీస్ స్టేషన్ పరిధిలో నాగేంద్ర, షబ్బీర్‌కు ఎనిమిదిరోజుల పాటు జైలు శిక్ష, రామకృష్ణ, సుబ్బరాయుడు, బాబు, చెన్నకేశవరెడ్డి, నరసింహకు రూ. 2 వేల చొప్పున జరిమానా విధించారు. అలాగే రేవనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో కంబగిరి రాముడు, శ్రీకాంత్, పెద్దయ్య, అమరేష్ వెంకటేశ్వర్లు అనే వ్యక్తులకు ఐదు రోజుల జైలు శిక్ష, రూ. 2500 చొప్పున జరిమానా వేశారు. దొర్నిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో తరుణ్, పగ్గులయ్య, హరి, నాగదాస్, మహ్మద్ ఉసేన్, గైబుసమిటయా, భాస్కర్‌రెడ్డి, రాములకు ఏడు రోజుల పాటు జైలు శిక్ష, షరీఫ్, అన్వర్‌బాషాకు రూ. 2 వేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ వివరించారు.

ట్రాక్టర్ చోరీ కేసు నిందితుల అరెస్టు

బేతంచెర్ల: పట్టణంలోని రైల్వే గేట్ల వద్ద చోరీకి గురైన ట్రాక్టర్ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ ప్రియతం రెడ్డి శుక్రవారం తెలిపారు. తలారి పుల్లయ్య ట్రాక్టర్‌ను రైల్వే గేట్ల వద్ద పార్కు చేసి ఉంచగా రెండు నెలల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. ట్రాక్టర్ చోరీకి పాల్పడిన నిందితులు డోన్ మండలం కమలాపురం వడ్డె నాగరాజు, కొలిమిగుండ్ల మండలం చింతలాయపల్లె శివయ్యను సంజామల మండలం గిద్దలూరు క్రాస్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు.

నేటి విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణ వాటర్ వర్క్స్ సబ్ స్టేషన్‌లోని హైవే ఫీడర్, ఇండస్ట్రీయల్ సబ్ స్టేషన్‌లోని యు.కొత్తపల్లె సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైయస్సార్ నగర్, తారకరామనగర్, ఆర్టీసీ కాలనీ, వ్యవసాయ మార్కెట్ యార్డు, కోట్లవారి పల్లె తదితర ప్రాంతాల్లో ఉదయం10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంటు ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

బనగానపల్లెరూరల్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి(ఫైర్ ఆఫీసర్) అవినాష్ జైసింహ సూచించారు. శుక్రవారం స్థానిక ఆక్సిలియం ఉన్నత పాఠశాలలో స్పార్క్ (సైంటిఫిక్ ప్రోగ్రాం ఫర్ అకాడమిక్ రీసెర్చ్ క్యూబ్), గ్రామీణ శాస్త్రీయ ఇంక్యుబేటర్ కేంద్రాన్ని స్పార్క్ సీఈఓ సాయిప్రదీప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ అవినాష్ జైసింహ మాట్లాడుతూ స్పార్క్ ఫౌండేషన్ వారు ఇలాంటి సైంటిఫిక్ ఇంక్యుబేటర్ సెంటర్‌ను గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేయడం హర్షించ తగింద న్నారు. స్పార్క్ సీఈఓ సాయి ప్రదీప్ మాట్లాడుతూ గ్లోబల్ టెక్నాలజీ ఇంక్యుబేటర్ ద్వారా భవిష్యత్తులో నేర్చుకొనే విషయాలను ముందుగానే నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం రీసైకిల్‌తో వివిధ వస్తువుల తయారి వాటి వినియోగం పై విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించడంతో పాటు రాడార్ నావిగేషన్ సిస్టం, టెలిస్కోప్ ప్రదర్శన,మార్స్ రోవర్ యంత్రం, సెన్సార్ డ్రోన్, రాకెట్ మోడల్ ప్రదర్శనను విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో ఎంఈఓ స్వరూప,అక్సిలియం విద్యానికేతన్ హెడ్ సిస్టర్ నిర్మాల, స్పార్క్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ


అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: స్థానిక అంకాలమ్మ చౌరస్తాలో జీర్ణోద్ధరణ గావించిన మారెమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, అవాహిత దేవతా హోమాలు, బింబకళాన్యాసము, ప్రాణప్రతిష్ఠ, కక్షాజ్యాల, కూష్మాండబలి, పూర్ణాహుతి, మారెమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవాలకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, తదితర ప్రముఖులు హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ప్రమాద బీమా కొండంత అండ

బేతంచెర్ల: ప్రమాద బీమా పథకం బాధిత కుటుంబాలకు కొండంత అండగా ఉంటుందని స్టేట్ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామానికి చెందిన ఆలా మద్దిలేటి(28) స్టేట్ బ్యాంక్‌లో రూ.500 ప్రమాద బీమా చెల్లించాడు. గత ఏడాది అక్టోబర్‌లో అవుకులో జరిగిన ప్రమాదంలో మరణించాడు. ఈ మేరకు ప్రమాద బీమా కింద రూ.10లక్షలు మంజూరు అయ్యింది. మృతుడు మద్దిలేటి భార్య దేవిశెట్టి మౌనికకు శుక్రవారం బీమా చెక్కును మేనేజర్‌తోపాటు ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్సు ప్రతినిధి కిరణ్ నాయక్ అందజేశారు.

వైఎస్సార్ జలకళ బోర్లు ఏర్పాటు

కొలిమిగుండ్ల: వైఎస్సార్ జలకళ పథకం కింద చింతలాయిపల్లెలో బోర్లు ఏర్పాటు చేస్తున్నారు. గురు, శుక్రవారాల్లో 15 మేర బోర్లు వేశారు. రైతు అంబటి చంద్రమోహన్‌రెడ్డికి చెందిన పొలంలో మూడు ఇంచులకు పైగానే నీళ్లు పడ్డాయి. మిగిలిన రైతుల పొలాల్లో సైతం ఆశించిన స్థాయిలో భూగర్భ జలాలు పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. జలకళ పథకం ద్వారా మెట్ట భూములకు మోక్షం లభిస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మొదటి విడతలో చింతలాయిపల్లె పంచాయితీ పరిధిలోని గ్రామాల్లో 30 బోర్లు ఏర్పాటు చేశారు. వీటిలో కొంత మందికి విద్యుత్ సరఫరా, మోటార్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించడంతో రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు. జలకళ పథకం కింద బోర్లు ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డితో పాటు రైతులు కృతజ్ఞతలు చెప్పారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల: అంటువ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రిన్సిపాల్ కేశవరావు సూచించారు. స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మట్టి, కలుషితనీరు, తదితర ఆహార పదార్థాల ద్వారా నులిపురుగులు శరీరంలోకి వ్యాప్తి చెందుతాయన్నారు. వీటివల్ల డయేరియా, కడుపునొప్పి వంటి వ్యాధులు వస్తాయన్నారు. ఆల్‌బెండజోల్ మాత్రలు వేసుకోవడం వల్ల నులిపురుగుల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బాబునాథ్, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, అన్నపూర్ణ, లక్ష్మిదేవి, కృష్ణదాసు పాల్గొన్నారు.